# ఐదు నిమిషాలు

రాజా

★

ప్రభాకరం ఓపికలేకుండా గదిలో పచార్లుచేస్తున్నాడు. అతని కళ్ళల్లో ఒక విధమైన ఆతృత కనిపిస్తోంది. ఇంతట్లోకే అది మాయమై అతని అంత్యఘడియని మాచిస్తోంది గోడ గడియారం ఎదురుగా పెద్ద చప్పుడుగా టిక్కుటిక్కుమంటోంది అది, "నీ ఆశ నిరాశే" అని మందలిస్తున్నట్లనిపించింది ప్రభాకరానికి.

ఆ గడియారం కొని ఎన్నో రోజులుకాలేదు. దాని రయలులో మెరుపింకా తగ్గలేదు ఆ గడియారంక్రిందగా ఒక కిటికీ నల్లటి ఆకాశంలో ఉండే చుక్కల్ని లీలగా చూపిస్తోంది ఆ కొద్దిపాటి నక్షత్ర కాంతిలో ప్రభాకరం గడియారం కేసి చూశాడు అబ్బ! తన అంత్య ఘడియకి ఇంకా అయిదు నిమిషాలుమాత్రమే ఉంది ఈ అయిదు నిమిషాల్లోనే తన జీవిత నావ చుక్కాని అటో, యిటో తేలిపోవాలి.

అతను నిలబడలేకుండా పచార్లు చేస్తున్నాడు. మధ్యమధ్య కిటికీలోంచి చూస్తున్నాడు ప్రభాకరానికి ఒక భయం ఆవరించింది. ఏమిటిది? తన ఆశ నిరాశా? తన నిశ్చయానికి ఆమె అంత మాత్రం విలువేనా చూపించలేదా? అతనిలో ఆతృత నిమిష నిమిషానికి ఎక్కువవుతోంది. నియమితమైన కాలందాటిపోతోంది కాని ఎవరూ కనుచూపు మేరదూరంలోనైనా లేరు.

ఏమిటిది? ఆమె ఎందుకు రాలేదు? ఇంకా పదకొండుకి మూడు నిమిషాలుమాత్రమే. నిమిషాలు జరిగిపోతాయి! తన నిశ్చయం అమల్లోకి వచ్చేస్తుంది— విమల తననిగురించి ఎందుకింత అలక్ష్యంగా ఉంది?

ప్రభాకరం, విమలా ఒకరినొకరు ప్రేమించుచున్నారు, కాని విమల వివాహితురాలు.

ప్రభాకరం చాలా పట్టుదలమనిషి. యిట్టే కోపంవస్తుంది కాని ఎవరన్నా అంటే యిష్టపడితే తన ప్రాణాలన్నీ వాళ్ళమీద పెట్టేసుకుంటాడు.

కాని విమల అతని జీవితంలో ప్రవేశించి, అతని మనస్తత్వాన్ని మార్చేసింది. యింతకుముందెన్నడూ ప్రభాకరం మొదటిచూపులో కలిగే ప్రేమని విశ్వసించలేదు కాని విమలని చూడగానే అతను ఆమెతో ఇంతకుముందెప్పుడూ పరిచయంలేకపోయినాకూడా ఆమె ముందు తన హృదయాన్ని విప్పిచెప్పాడు. కాని ఆమె వివాహిత అని అతనికి తరవాత తెలిసి వచ్చింది—!

విమలకూడా అతనికి తన హృదయంలో ఒక నియమిత స్థానాన్ని ఏర్పరచుకుంది. "భౌతికంగా ఆమె అతనిది కాలేదు ఆమె భర్త మరొకదాన్ని ఉంచుకొని తిరుగుతున్నాడు ఆ పెళ్ళి ఆమెకి బలవంతంగా జరిగినదే. అంచేతసంఘపు కట్టుబాట్ల చేత ఆమె ఇప్పుడు ప్రభాకరాన్ని దూరాన్నించే ప్రేమించాలి. అది సాధ్యమే, ఈ విషయాలన్నీ ప్రభాకరం అర్థంచేసుకున్నాడని విమల ఊహించింది.

కాని ప్రభాకరం ఆమెని అర్థంచేసుకోలేదు. ఆమె చెప్పిన విషయాలన్నీ పగటి కలలుగా త్రోసి

వున్నాడు. తాను ఇప్పుడు వివాహిత అని విచారించవలసిన అవసరం లేదన్నాడు. "పెళ్లి అనేది కేవలం సాంఘిక కట్టుబాట్లవల్ల ఏర్పడినదే, దానికీ హృదయానికీ సంబంధంలేకపోడం ఈ నాటి క్రొత్తగాథ. ఇందులో ఎవరికిష్టం లేకపోయినా ఈ కట్టుబాట్లని త్రెంచుకుని, ఇంకొకరితో పోవచ్చు. నీకు నామీద ఉన్న ప్రేమకి గుర్తుగా ఆ బంధనాల్ని త్రెంచుకునేందుకు అన్ని హక్కులూ ఉన్నాయి ఇల్లాంటి పరిస్థితుల్లో నువ్వు చేసేది తప్పని నువ్వు ఊరికే వ్యథపడనక్కరలేదు. నువ్వు నన్ను ప్రేమించకుండా ఉన్నట్టయితే మాత్రం......నీ భర్తతో యథేచ్ఛగా ఉండు. ఇందులో నా అభ్యంతరం కించిత్తూ లేదు" అన్నాడు ప్రభాకరం.

ఈ ఆఖరి వాక్యం విమలకి కష్టం కలిగించింది. తాను ప్రభాకరాన్ని ప్రేమించింది. అందులో ఏమాత్రమూ సందేహించవలసినదిలేదు. తన హృదయంలో అంతటా ప్రభాకరం ప్రతిబింబం ఉంది. ఆ ప్రేమ ఉంది గదా అని ఆమె భర్తని వదలి పారిపోయిరా వక్కరలేదు. మానసికంగా ప్రేమిస్తే చాలు.

"నేను చెప్పినట్టుచెయ్యి. ఇది నీ మంచికీ, నా మంచికీకూడా తోడ్పడుతుంది. నువ్వు నీ భర్తనే అంటిపెట్టుకుని వుంటావనుకో నువ్వు నీ భర్తని ప్రేమించటంలేదనినాకు తెలుసు. అంచేత మనం ముగ్గురమూకూడా సంతోషంలేనివాళ్ళమవుతాము. కాని మనమిద్దరం లేచి పోయామనుకో, నీ భర్త తను వుంచుకున్నదానితో స్వేచ్ఛగా వుంటాడు, మనిద్దరికీకూడా సంతోషకరంగా వుంటుంది. నువ్వు నే చెప్పినట్టు చేస్తే ప్రపంచంలో చాలా సంతోషవంతుణ్ణి నేనే అని చెప్పుకుని గర్వపడతాను. లేదా, ప్రపంచంలో అధః పాతాళంలోకి కృంగిపోతాను నువ్వు లేకపోతే నే నొక్కక్షణంకూడా జీవించలేను నువ్వు నా ప్రాణానికంటే ఎక్కువ." అన్నాడు ప్రభాకర్.

అతను వాచీ కేసి చూసుకున్నాడు," ఇదుగో ఇప్పుడు పదకొండయింది సరిగ్గా. రేపురాత్రి సరిగ్గా ఇదే టయిముకి నువ్వులేచి రావాలి పదకొండున్నర బండికి ప్రయాణమయిపోదాం. కాని, నువ్వు యిరవైనాలుగుగంటల్లో బాగా ఆలోచించుకో పదకొండులోపుల రాలేకపోయావా నీకు నామీద ప్రేమలేదనుకుంటాను. మళ్లీమనం తిరిగి కలుసుకోలేం, ఈ పదకొండు గంటలు నాకు కేవలం ప్రాణాలతో చెలగాటం" అన్నాడు.

పదకొండుకి ఒక్క నిమిషం తక్కువగా వుంది, ఆమె రాలేదు, నిమిషాలముల్లు చాలా దగ్గిరకి వచ్చేసింది. ప్రభాకరం గడియారంకేసీ, కిటికీకేసీ, చూశాడు. చివరికి బల్లకేసి చూశాడు. "టంగ్" "టంగ్" మంటూ పదకొండు కొట్టింది.

ఒక్కక్షణంపాటు ప్రభాకరం నిశ్చేష్టుడయ్యాడు, మరుక్షణం పొడుగులోంచి తుపాకీతీసి నుదుటిమీద పెట్టుకుని "ట్రిగ్గర్" లాగాడు.

"ఢబ్" మనే చప్పుడు—! ప్రభాకరం నేలకొరిగాడు.

ఇంతలోనే టార్చితో ఒక స్త్రీ మూర్తి తలుపు తోసుకుని లోపల ప్రవేశించింది. ఆ కాంతిలో అతను వద్ద అదటుకి ఆగిపోయిన వాచీ 10-55 చూపించింది.

ఆ స్త్రీ కొయ్యబారిపోయింది.